# కొత్త నాన్న

కె.వి.యస్. వర్మ

ఆ హరిజన వాడ అలవైకుంఠంబున... అన్నట్టులేదు. పచ్చని పొలం పక్కన ఓ రాళ్ల గుట్ట పడివున్నట్టుంది. పూరి గుడిసెలు దగ్గర దగ్గరగా బ్రహ్మాజెముడు డొంకల్లా వున్నాయి. గుడిసెల్లోని మనుషులు వెలుగుతున్న దీపాల్లాగా వున్నారు. మలుగుతున్న దీపాల్లాగా వున్నారు.

"ఒరే జగ్గన్నా. సామాన్లన్నీ కొన్నట్టేనా" అన్నాడు క్రిష్ణయ్య.

"అన్నీ కొని తెచ్చాం నాన్నా"

"మళ్లీ ఇంకోపాలి అన్నీ వున్నయ్యో నేదో సూడు"

"చూశాను. బట్టలు మాత్రం సరిపడా కొనలేదు. ఇంక డబ్బు లేదన్నావుగా మరి" అన్నాడు జగ్గారావు.

"రెక్కలు ముక్కలు సేసుకుంటే కానీ, డొక్కాడనోళ్లం. ఈ మాత్తరం కరుసు పెట్టడమే మనకి గొప్ప" అన్నాడు క్రిష్ణయ్య చద్దన్నం ముగించి లేస్తూ.

జగ్గారావు విని వూరుకున్నాడు.

"మన సూరన్నా, సెంద్రవూ రేపే గందా వత్తామని రాసేరు"

"అవును" అన్నట్టు తలూపాడు జగ్గారావు.

"రేపు సేపలు తెచ్చి పులుసొండవే" అన్నాడు క్రిష్ణయ్య గుడిసెలోంచి వొంగుని బయటికొస్తూ.

"అట్టాగేలేవయ్యా" అన్న భార్య మాట వినిపించింది.

"కిట్టయ్యా, పెళ్లి పన్లు అయినట్టేనా"

"అవుతున్నాయి తాతా. పన్లోకేనా"

"సినకాపుగోరి పన్లోకి" అని నెమ్మదిగా అడుగులేస్తూ వంగిన నడుంతో ముందుకెళ్లాడు తాత.

"సెట్టంత కొడుకు మావిడి సెట్టు కొడుతూ అది మీద పడి సచ్చిపోనాడు. ఆడే వుంటే తాతకీ వయుసులో పన్లోకెళ్లాల్సిన పనుండేది కాదు గందా" అనుకుని, నిట్టూర్చి పొలంలోకెళ్లాడు క్రిష్ణయ్య.

కొడవలి తీసుకుని కోత పనిలో పడ్డాడు క్రిష్ణయ్య మిగతా వాళ్ల పక్కన వొంగుని.


"నాన్నా, ఈ రెండ్రోజులూ పని మానెయ్యమంటే మానేవుకాదు" అన్నాడు సాంబడు కోసిన వరి ఎన్నెలు పనగా పెడుతూ.

"ఒరే సాంబా. రేప్పెళ్లెట్టుకుని నువ్వు మాత్రం పని మానేవేంటిరా. ఏ రోజు పని మానితే ఆ రోజు పస్తులుండాలని నీకూ తెల్సు, నాకూ తెల్సు. మన్లాంటోళ్ల పేమలూ, అభిమానాలూ మాటలవరకేరా"

తండ్రి మాటకు సాంబడు బదులివ్వకుండా వరి. కోస్తున్నాడు

"సాంబడు కూడా నాలాగే బతక్క తప్పదు. ఇది బండ బతుకు. కస్టవే తప్ప సుకం లేని బతుకు. రోజూ రేపెలాగనే బయం. తిండి దొరుకుతాదో నేదో అని బయం. జొరవొస్తే పనికెళ్లలేను గందా అని బయం. సుట్టవొత్తే బయం. వున్న వొక్కగా నొక్క కూతురి పెళ్లి సెయ్యగలనోలేనో అని బయం. మంచి సంబందవే సేసేను. ఆ బయం పోనాది. జగ్గడు ఈ ఏడు పరీచ్చ అవుతాడో నేదో అని బయం. సదువవంగానే ఆడికి సెంద్రం వుజ్జోగం ఇప్పిస్తానన్నాడు. సెంద్రంతోపాటు సాంబడికి కూడా బళ్లో ఎయ్యమని మాస్టారెంత సెప్పినా నేనిని సావనేదు. మాకు సదువేంటి బాబూ అన్నాను. సాంబడు కూడా సదువుకునుంటే సెంద్రంలాగ వుండేవాడేమో. జగ్గన్నకన్నా ఈ సదువు సెప్పిస్తన్నానంటే అదంతా సెంద్రం బలవంతం వల్లేగందా" అని ఆలోచిస్తూ ధాన్యం వరి కోస్తున్నాడు క్రిష్ణయ్య.

అప్పుడక్కడి ఎండ కష్టాల కొలిమిలా వుంది.



* * *

అఫీషియల్ కాలనీ అప్సరసలా అందంగానూ, అద్దంలా శుభ్రంగానూ వుంది. అక్కడి మనుషులు సముద్ర కెరటాల్లా హడావుడిగానూ, సముద్ర మధ్యంలా నిశ్చింత గానూ వున్నారు.

"నాన్నా, ఇంకా అలానే కూర్చున్నావేంటి? త్వరగా తయారవ్వు"

"నేనెందుకులేరా. మీరెళ్లండిరా"

"మనందరమూ వెళ్తేనే మా ఫ్రెండు ఆనందిస్తాడు. ఇంకేం చెప్పక తయారవ్వు" అన్నాడు చంద్రం.

"ఇంక తప్పేట్టునేదు" అనుకుని, సూరన్న టి.వి. ముందు నుంచి లేచి బాత్ రూమ్‌లో కెళ్లాడు.

సూరన్న స్నానం చేసి, బట్టలేసుకుని హాల్లో కొచ్చేటప్పటికి ఒకతను పళ్లబుట్ట పట్టుకుని వచ్చాడు.

"నమస్కారమండి. సార్ వున్నారండీ" అన్నాడతను పళ్ల బుట్ట హాల్లో ఓ మూల పెడుతూ.

"వున్నాడు. ఇట్టాకూసోండి," అని 'సెంద్రం' అని కేకేశాడు సూరన్న.

చంద్రం హాల్లోకి రాగానే, అతను నిలబడి, "నమస్కారం సార్" అన్నాడు.

"డ్యూటీలో జాయినయ్యావా"

"చేరేనండి. నాకుద్యోగం ఇప్పించారు. మీ మేలు మర్చిపోలేనండి" అన్నాడతను గొంతులో కృతజ్ఞత ధ్వనిస్తుండగా.

"దాందేంవుందిలే. ఉద్యోగం జాగ్రత్తగా చేసుకో." అని చంద్రం కుర్చీలోంచి లేచాడు.

"బయటకు వెళ్తున్నట్టున్నారు. వెళ్లొస్తానండి" అని అతనూ లేచాడు.

చంద్రం, అతని భార్య, మూడేళ్ల కూతురు, సూరన్న వీధిలోకొచ్చి ఆటో ఎక్కారు.

చల్లగాలి హాయి హాయిగా వుంది. మెయిన్ రోడ్డులోని షాపులు రంగు రంగుల దీపాలతో మెరిసిపోతున్నాయి.

అంతా ఆటో దిగారు. ఆటో ముందున్న డాబా తెల్లగా ఆకాశంలా అందంగానూ, విశాలంగానూ వుంది. చంద్రం స్నేహితుడు అందర్నీ సాదరంగా ఆహ్వానించాడు. మెట్లెక్కి డాబా మీదకెళ్లారు. షామియానా ట్యూబ్ లైట్ల వెలుగులో ఎర్రగానూ, నీలంగానూ, తెల్లగానూ వుంది.

అప్పటికే వచ్చివున్న చాలామంది కుర్చీల్లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు. చంద్రం కుటుంబాన్ని అతని స్నేహితుడు పేరుపేరునా అందరికి పరిచయం చేశాడు. అలా పరిచయం చేస్తున్నప్పుడు చంద్రం

అఫిషియల్ కాలనీ అప్సరసలా అందంగానూ, అద్దంలా శుభ్రంగానూ వుంది. అక్కడి మనుషులు సముద్ర కెరటాల్లా హడావుడిగానూ, సముద్ర మధ్యంలా నిశ్చింతగానూ వున్నారు.



తండ్రిని చూశాడు. "కొంచెం బెరుగ్గా వున్నప్పటికీ ఇంతకు ముందు కంటే కొంచెం నయం" అనుకున్నాడు చంద్రం.

చంద్రం స్నేహితుడి అయిదేళ్ల కొడుకు బర్తడేకేక్ కట్ చేశాడు. అందరూ చప్పట్లు కొట్టారు. కేక్ ముక్కలు తింటూ కబుర్లలో పడ్డారు.

ముసలివాళ్లంతా ఒక చోట చేరారు.

"సూరన్నగారూ. మా టౌన్లో మీకు కాలక్షేపం బాగా జరుగుతోందా." అని ఓ రిటైర్డ్ ఆఫీసరు అడిగాడు.

"బానే అవుతోందిలెండి. తెల్లారగట్లే లేచి, కోసుడు దూరం నడిసొస్తానండి. తానంజేసి, టిపినుతిని, మా మనవరాల్ని ఆడిత్తానండి. టి.వి. సూస్తానండి. మా కోడలు పేపరు సదివితే ఇంటానండి. మా సెంద్రం సెప్పే కబుర్లు పరేసరనుకోండి...."

అంటూ సూరన్న చెప్పుకు పోయాడు.

అలా అలా తన వూరి కబుర్ల వరకూ వెళ్లాడు.

"భూమి పుత్రుడు అంటే మన సూరన్నగారే. చూడండి. కాసేపు చెప్పేటప్పటికి తన వూరి సంగతుల్లోకెళ్ళిపోయారు. మనకూ చిన్నప్పుడు మన వూరితో సంబంధముండేది. కానీ, ఆయనకు ఇప్పటికీ సంబంధమున్నట్టే వుంది." అని ఆ రిటైర్డ్ ఆఫీసరు మిగతా వాళ్లతో అంటుంటే సూరన్నకు కొంచెం ఆనందం కలిగింది.

భోజనాలు చేసి, చంద్రం కుటుంబం ఆటోలో ఇంటికొచ్చింది.

"నాన్నా. నాకీవేళ చాలా సంతోషంగా వుంది. నలుగురిలో కలిసిపోయి ఇంచక్కా కబుర్లుచెప్పావు." అన్నాడు చంద్రం బట్టలు మార్చుకుని వచ్చి, తండ్రి భుజం తడుతూ.

"ఇక్కడి పద్దతులూ అవీ ఒక్కటొకటీ అలవాటవుతున్నాయి గందా" అన్నాడు సూరన్న మంచమెక్కుతూ.

"రేపొద్దుటే మనూరుకి ప్రయాణం. అక్కడ కూడా ఇక్కడిలాగే ఫ్రీగా వుండాలి" అన్నాడు చంద్రం ఆవలిస్తూ.

"అట్టాగెలె" అన్నాడు సూరన్న.

* * *

సూరన్న బస్సులో కార్నర్ సీట్లో కూర్చున్నాడు. నాలుగేళ్ల తర్వాత తన వూరు వెళ్తున్నందుకు అతనికి చాలా సంతోషంగా వుంది. కొడుకేం తంటా తెస్తాడో నని భయంగానూ వుంది.

"ఏదో ఒకటి జరుగుతాదిలే" అనుకున్నాడు.

అలా చాలాసార్లు తను అనుకున్నట్టు అతనికి గుర్తొచ్చింది.

"సిన్నప్పుడు వరాలురాజుగోరి పసువులు కాసేటప్పుడు, అవి వరిసేలో ఎక్కడ పడతాయోనని బయమేసేది. కొంచెం ఎదిగాక, టయానికి పాలు తీయించి అంపించకపోతే, రాజుగోరేం తిడతారోనని బయమేసేది. పెద్దయ్యాక దాన్యం కుప్పదగ్గిర కాపలా వున్నప్పుడు ఏ దొంగ నా కొడుకు లొచ్చి అట్టుకుపోతారోనని బయమేసేది. ఏదో ఇసజొరమొచ్చి పెద్దకొడుకు సచ్చిపోయేక, మిగతా ఇద్దరు కొడుకులకీ ఏ కాసింత జొరమొచ్చినా పెద్దకొడుకులా పోతారేమోనని బయమేసేది. రెండో కొడుకూ అట్టాగే పోయాడు. ఒకనాడు సెంద్రానికి ఇరేసనాలట్టుకుంటే, ముందులాగే బయమేసింది, తర్వాత, "ఏదో ఒకటి జరుగుతాదిలే" అని మొండి దయిర్యం తెచ్చుకున్నాడు. సెంద్రంబతికి బట్టకట్టాడు. ఆ తర్వాత, ఆడ్ని బళ్లో యేసేక, ఆడు సదివినంత సదువూ సెప్పించగల్నో నేదోనని బయమేసేది. సదువయ్యాక పుజ్జోగం వస్తాదో రాదోనని బయమేసేది. ఏడాదయినా రాకపోయేటప్పటికి "వచ్చినప్పుడొస్తదిలే" అని తనకు తను దయిర్యం సెప్పుకుని కొడుక్కీ సెప్పాడు. అనుకుంటూ సూరన్న కళ్లు తెరిచేటప్పటికి తన వూరు దగ్గర పడింది.

సూరన్న సీట్లో సర్దుకు కూర్చున్నాడు. అతవరకూ తల్లి ఒళ్లో నిద్రపోయిన పాప నిద్రలేచి, 'తాతా తాతా' అంటూ సూరన్న దగ్గరకొచ్చింది. సూరన్న మనవరాల్ని ఒళ్లో కూర్చోపెట్టుకుని ముద్దాడాడు. మనవరాలు మీసాలు పట్టుకు లాగింది. 'రాలుగాయి' అంటూ మనవరాలి బుగ్గలు నొక్కాడు పగలబడి నవ్వుతూ.

అంతలో బస్సాగింది. బస్సు దిగారు. సూరన్నకు తన వూరు చూడగానే హృదయం ఉప్పొంగింది. తనువు పులకరించింది. మనవరాల్ని ఎత్తుకుని సూరన్న నడుస్తుంటే, సూటుకేసు, బేగ్ పట్టుకుని కొడుకూ, కోడలూ అతని వెనక నడిచారు.

"ఈ నాలుగేళ్లలోనూ వూరు పెద్దగా మారలేదు. ఈ యీదుల్లో గోసీ యెట్టుకుని తిరిగిన నేను ఇయేల పంచె, సొక్కాయేసుకు నడుస్తున్నా. రోజులొక్కలా వుండవంటారందుకేగామోసు" అనుకుంటూ సూరన్న హరిజన వాడలోకి అడుగు పెట్టాడు.

అదే హరిజనవాడ. అవే గుడిసెలు. అదే గతుకుల మట్టిరోడ్డు. అవే చెత్తకుప్పలు. పక్కన అదే మురిక్కాలవ.

చిన్న నిక్కరేసుకున్న పదకొండేళ్ల కుర్రాడు వాళ్లను చూసి భయం భయంగా రోడ్డు పక్కన నిలబడ్డాడు.

ఆ కుర్రాడిని చూడగానే, "సిన్నప్పుడు నేను ఇట్టాగే వుండేవాణ్ని. ఎవరన్నా మంచి బట్టలేసుకున్నోళ్లు ఇటువస్తే, ఎందుకో బెరుగ్గా సూస్తూ దూరంగా వుండిపోయేవోణ్ని-" అనుకుని కుర్రాణ్ని ఇలా రమ్మని సంజ్ఞ చేశాడు సూరన్న. కుర్రాడు రాలేదు. మళ్లీ పిలిచాడు. కుర్రాడు బెరుకు బెరుగ్గా వచ్చాడు. ఎవరబ్బాయివని అడిగాడు సూరన్న. కుర్రాడు చెప్పాడు.

"అట్టాగా. మీ నాన్న బావున్నాడా" అని కుర్రాడి భుజం మీద చెయ్యేసి అడిగాడు సూరన్న.

"బావున్నాడు" అన్నట్టు తలూపాడు కుర్రాడు.

అంత దూరంలో చూడగానే క్రిష్ణయ్య, జగ్గారావు ఎదురొచ్చి, వాళ్ల చేతుల్లోంచి సూటుకేసు, బేగ్ వద్దన్నా వినకుండా తీసుకున్నారు.

ఒంగుని గుడిసెలో కెళ్లారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు.

అంతర్జాతీయ ఖ్యాతి నార్జించుకొన్న తెలుగు కథ ఈనాడు వ్యాపార విలువలకు బలైపోతున్నదని, మంచి కథలకు కొరత ఏర్పడుతున్నదని కథకులు, కథా వేదికల వారూ గొడవ పెట్టేస్తున్నారు. నిజమే కావచ్చు కానీ, కథకులు ఆర్థిక ప్రలోభాలకు, అర్థంలేని ప్రచారకాంక్షకు అమ్ముడుపోకుండా తమ నిజాయితీని నిలుపుకుంటూ సమాజం పట్ల ఆర్తితో, అవగాహనతో రాసే కథకుల కథలకు 'ఆహ్వానం' పలికే పత్రికలు లేకపోలేదనే విషయం ముందు గుర్తించి, ఇటువంటి పత్రికలకు తమ సహకారం అందించటం ద్వారా తమ వంతు బాధ్యతను నిర్వర్తించమని కోరుతున్నాం.

--ఎడిటర్

'ఆహ్వానం' ప్రచురించే విలువైన క్రొత్తకథల విశ్లేషణలో పాఠకుల్ని, రచయితల్ని పాల్గొనవలసిందిగా కోరుతున్నాం. తమ అభిప్రాయం సంక్షిప్తంగా, సమీక్షాత్మకంగా రాసి పంపితే ఎన్నిక చేసిన వాటిని ప్రచురించటమే గాక 50రూ. పారితోషికం కూడ పంపుతాం. —ఎడిటర్

"తానాలు సేస్తారా" అని అడిగాడు క్రిష్ణయ్య.

"చేస్తాం" అన్నట్టు తలూపాడు చంద్రం.

"మీ పట్నాల్లోలాగ తానాల గది నేదు మరి. ఆరు బయులే సెయ్యాల" అన్నాడు క్రిష్ణయ్య నెమ్మదిగా.

"అదేంటి, చిన్నాన్నా. నేను మాత్రం మొన్నటిదాకా ఆరుబయలే స్నానం చేసినో ణ్నికాదా" అన్నాడు నవ్వుతూ చంద్రం.

స్నానాలు అయ్యేక, "చిన్నాన్నా, పెళ్లి కింకా టైముంది కదా. ఈ లోగా అలా వూళ్లోకెళ్లి నలుగుర్నీ పలకరించి వస్తాం" అని, తండ్రితో పాటు బయుల్దేరాడు చంద్రం.

"ముందల్ల వరాలరాజు గోరింటి కెళ్దాం" అన్నాడు సూరన్న.

"అలాగే" అన్నట్టు తలూపి, "నేను చెప్పింది మర్చిపోకు" అన్నాడు చంద్రం.

"మొన్నటిదాకా ఆరాజుగోరి దగ్గిర పన్జేసినోడిని. విప్పుడు సేతులు కట్టుకు నుంచోవద్దంటే ఎట్టారా? ఆయునేవనుకుం టాడు"

"ఏమీ అనుకోరు. అనుకున్నా పట్టిం చుకోనక్కర్లేదు"

"నీకేం, నువ్వేటన్నా అంటావ్. మనకే కట్టవొచ్చినా ఈ రాజుగోరే ఆదుకున్నారు."

"నాన్నా, అదంతా నాకు మాత్రం తెలీదా? నువ్వు నిజాయితీగా, ఒళ్లొంచి పని చేశావు కాబట్టే ఆయన నిన్ను బాగా చూసుకునినారు. ఆయన ఎన్ని చేసినా, నిన్ను పాలేరుగానే చూశారు. ఇప్పుడు నువ్వు పాలేరువుకాదు. అది గుర్తించుకో" అని చంద్రం ముందుకు నడిచాడు.

సూరన్న ఆలోచిస్తూ కొడుకు వెనక నడిచాడు.

వాళ్లు వెళ్లేటప్పటికి వరహాలరాజు వీధ రుగు మీద కూర్చుని మనవణ్ని ఆడిస్తు న్నాడు.

చంద్రం ఇంటి మెట్లెక్కి "రాజుగారూ బావున్నారా" అని పలకరించి, మెట్లకు ఇటువైపు అరుగు మీద వరహాలరాజుకు ఎదురుగా కూర్చున్నాడు

"నాన్నా, రా, కూర్చో" అన్నాడు.

సూరన్న వచ్చి, కొడుకు పక్కన కూర్చుని "రాజుగోరూ, దండాలండి. బావు న్నారా" పలకరించాడు.

"ఆc ఆc" అని, "సూరా నువ్వా, మీ అబ్బాయి చంద్రం కదూ. ఎవరో అనుకున్నాను' ' అన్నాడు వరహాలరాజు ముఖం కొంచెం అప్రసన్నంగా పెట్టి.

"మా తమ్ముడి కొడుకు మనువుకి వచ్చేం రాజుగోరూ. రాత్తిరికి మనువయి పోగనే, పొద్దుటే పట్నం ఎళ్లిపోతాం. మా సెంద్రానికి సెలవులేదంట. మిమ్మల్ని సూసిపోదారని ఇలా వచ్చేం" అన్నాడు సూరన్న.

ఆమాటకు ఆనందించి, "చంద్రానికి సెలవు లేకపోతే, తను వెళ్తాడు. నువ్వు రెండ్రోజులుండి వెళ్లు' ' అన్నాడు వరహాల రాజు ముఖం ప్రసన్నంగా పెట్టి.

' సూరన్న చంద్రం వంక చూశాడు.

"చంద్రం, నువ్వింత ప్రయోజకుడివి అయినందుకు చాలా సంతోషంగా వుంది. మా పెద్దోడు రాజకీయాలనీ, పేకా టనీ తిరుగుతూ ఒకో ఎకరం అమ్ముకొస్తు న్నాడు. మా చిన్నబ్బాయి చదువు ఈ సంవత్సరంతో అయిపోతుంది. నువ్వేదన్నా వుద్యోగం చూసిపెడుదూ."

"సెంద్రం తప్పకుండా ఏయిస్తాడు రాజుగోరూ" అన్నాడు సూరన్న.

అవునన్నట్టు తలూపాడు చంద్రం.

వరహాలరాజు ముఖం చాటంతయింది.

కాసేపు పిచ్చాపాటీ మాట్లాడుకు న్నారు.

"ఇక వెళ్ళొస్తాం" అని లేచారిద్దరూ.

"సూరా, రేపుంటున్నావా"

"నేదండి. మా తమ్ముడింట్లో పెళ్లి అడావుడి గందా. మళ్ళొచ్చినప్పుడు రెండ్రో జులుంటాను రాజుగోరూ"

"మంచిది సూరా. చంద్రం, మా అబ్బాయి గురించి మర్చిపోకు" అన్నాడు వరహాలరాజు.

ఇద్దరూ మెట్లుదిగి వీధిలో కెళ్లారు. అప్పుడే వెన్నెల వచ్చేసింది.

"సెంద్రం, మొదట్లో నేనేదో బయుప డ్డానుగానీ, రాజుగోరు నేనయునతో సమాన పాయులో కూసున్నందుకు కోపగించుకో లేదు" అన్నాడు దారిలో సూరన్న.

"కోపగిస్తే ఏం చేసేవాడివి"

"ఎంటనే వచ్చేద్దును. ఇంకోసారి ఆ గెడప తొక్కేవాడినికాను."

చంద్రం గబుక్కున తండ్రి చెయ్యి పట్టుకున్నాడు. ఇదే వీధిలో ఎన్నోసార్లు తను చంద్రం చెయ్యి పట్టుకుని నడిపించడం సూరన్నకు గుర్తొచ్చింది.

"మన జగ్గారావుతో పాటు రాజు గోరి సిన్నబ్బాయికూ్కడా వుజ్జోగం సూడు. పాపం, బాగా సితికి పోయినట్టున్నారు"

"తప్పకుండా చూస్తాను" అని చంద్రం తండ్రి చెయ్యి నొక్కాడు మెల్లిగా.

(శ్రీ రాచకొండ విశ్వనాథ శాస్త్రి "గోవులొస్తున్నాయి జాగ్రత్త" లోని ఓ సూక్తి ఆధారంగా ఈ కథ)

